# సాక్షి నల్లగొండ

ఆదివారం ; 23 ; జూలై ; 2023






**'నకిలీ' భయం!**

ప్రముఖ కంపెనీ పేరుతో అడ్వాన్స్ తీసుకుని.. మరో కంపెనీ ఎరువులు సరఫరా చేస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. - 8లో



**రేషన్ కల్తీ బియ్యం!**

మునుగోడు మండలంలోని కిష్టాపురం గ్రామంలో రేషన్‌లో కల్తీ బియ్యం వచ్చాయని మహిళలు తెలిపారు. - 8లో

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం 31°/25°

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### 31,805 మంది దివ్యాంగులకు మేలు

నల్లగొండ : తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగులకు పింఛన్‌ను మరో వెయ్యి రూపాయలు పెంచుతూ శనివారం ఉత్తర్వులు జారీ చేయడంతో జిల్లాలో 31,805 మంది దివ్యాంగులకు మేలు కలగనుంది. దివ్యాంగులకు ప్రస్తుతం ప్రతినెలా రూ.3,116 పింఛన్ ఇస్తోంది. ప్రస్తుతం మరో రూ.వెయ్యి పెంచడంతో వారి పింఛన్ రూ.4,116కు పెరిగింది. పెరిగిన పింఛన్ ఈనెల నుంచే అమల్లోకి వస్తుందని ప్రభుత్వ పేర్కొంది.

### నలుగురు ఎస్‌ఐలకు సీఐగా ఉద్యోగోన్నతి

నల్లగొండ క్రైం : జిల్లాలో నలుగురు ఎస్‌ఐలకు సీఐగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ మల్టీజోన్‌-2 ఐజీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. డీటీసీలో ఉన్న మగ్దుంఅలీ, డీసీఆర్‌బీలో ఉన్న ఎమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నకిరేకల్‌లో ఉన్న నరేష్, వీఆర్‌లో ఉన్న క్రాంతికుమార్ సీఐగా ఉద్యోగోన్నతి పొందారు.

### 28న హకీంపేట్‌లో ఎంపిక పోటీలు

నల్లగొండ టూటౌన్ : తెలంగాణ రాష్ట్ర క్రీడల పాఠశాలల్లో అడ్మిషన్లకు సంబంధించి జిల్లా నుంచి ఎంపికైన విద్యార్థులకు ఈనెల 28న హైదరాబాద్‌లోని హకీంపేట్ క్రీడల పాఠశాల వద్ద క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి మక్బూల్ అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడా పోటీలకు జిల్లా నుంచి 40 మంది విద్యార్థులు ఎంపికయ్యారని, వారంతా 28న ఉదయం 6 గంటలకు హకీంపేట పాఠశాల వద్ద హాజరు కావాలని పేర్కొన్నారు. అక్కడ పోటీలు నిర్వహించి క్రీడా పాఠశాలలకు ఎంపిక చేస్తారని పేర్కొనారు.

### ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

నల్లగొండ టూటౌన్ : నీలగిరి మున్సిపాలిటీ కార్యాలయంలో పని చేస్తున్న ఇద్దరు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడింది. ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ విధుల్లో నిర్లక్ష్యం చేస్తుండడంపై మున్సిపల్ కమిషనర్ కె.వి.రమణాచారి వారిని సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రికార్డులు నిర్వహణలో అలసత్వం వహించవద్దని పలుమార్లు హెచ్చరించినా వారిలో మార్పు రాకపోవడంతో ఆ ఇద్దరు ఉద్యోగులు సస్పెన్షన్‌కు గురయ్యారు.

### పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

నాంపల్లి : నాంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో వ్యవసాయ భూమిలో నాలా అనుమతి లేకుండానే దుకాణాల నిర్మాణానికి అనుమతి ఇచ్చిన కార్యదర్శి మహ్మద్ సత్తార్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీఓ శేషుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కార్యదర్శులు ప్రభుత్వం అనుమతులు లేని చోట నిర్మాణాలకు అనుమతులు ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### 25, 26 తేదీల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్

నల్లగొండ : బెస్ట్ అవైలబుల్ స్కీంలో ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 25, 26 తేదీల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో 25వ తేదీన 1వ తరగతిలో చేరే విద్యార్థులకు, 26న 5వ తరగతిలో చేరే విద్యార్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని పేర్కొన్నారు.

### నారసింహుడికి నిత్యారాధనలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శనివారం నిత్యారాధనలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు శ్రీస్వామి వారికి సుప్రభాత సేవ, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం, సహస్ర నామార్చన, కుంకుమార్చన గావించారు. ఇక ఆలయ ముఖ మండపంలోని ఉత్సవమూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన, శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడుసేవోత్సవం నిర్వహించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

# 14 మండలాల్లో లోటు!

**సీజన్ ముగుస్తున్నా కరుణించని వరుణుడు**

- 10 మండలాల్లో అధికం, 8 మండలాల్లో సాధారణ వర్షపాతం
- సాగు అంచనాలు తలకిందులు
- నార్లు పోసుకుని నీళ్ల కోసం ఆయకట్టు రైతుల ఎదురుచూపు



పెద్దవూర : పత్తి విత్తనాలు వేస్తున్న కూలీలు

నల్లగొండ అగ్రికల్చర్ : వానాకాలం సీజన్ ముగియవస్తున్నా జిల్లాలో ఇప్పటి వరకు 14 మండలాల్లో లోటు వర్షమే కురిసింది. 10 మండలాల్లో అధిక వర్షం కురవగా.. 8 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. జూలై మొదటివారంలో నైరుతి రుతుపవనాలు జిల్లాకు తాకినప్పటి నుంచి ప్రస్తుత ఉపరితల ఆవర్తన ద్రోణి కారణంగా ముసురుతో కూడిన వర్షం మాత్రమే జిల్లాలో కురిసింది. లోటు వర్షం కారణంగా జిల్లా వ్యాప్తంగా సాగు అంచనాలు తలకిందులవుతున్నాయి. ఇప్పటి వరకు యాభై శాతం మాత్రమే పంటలు సాగయ్యాయి.

**11,54,286 ఎకరాల్లో సాగు అంచనా..**

ఈ వానాకాలంలో పత్తి 6.50 లక్షల ఎకరాల్లో వరి 5.25 లక్షల ఎకరాల్లో, కంది 10 వేల ఎకరాల్లో ఇతర పంటలు కలిపి మొత్తం 11,54,286 ఎకరాల్లో సాగు కానున్నట్లు వ్యవసాయశాఖ అంచనాలు వేసింది. కానీ ఇప్పటి వరకు కేవలం 6,61,328 ఎకరాల్లో మాత్రమే రైతులు పంటలు సాగు చేశారు. అందులో పత్తి 5,79,428 ఎకరాల్లో వేయగా.. వరి నాట్లు 70,045 ఎకరాల్లో, 942 ఎకరాల్లో కంది తదితర పంటలను సాగు చేశారు. నాన్‌ఆయకట్టు ప్రాంతంలోనే పత్తితో పాటు వరినాట్లు వేసుకున్నారు. నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతంలో నార్లు పోసుకున్నప్పటికి ఎడమ కాల్వకు నీరు విడుదల అయితేనే నాట్లు వేసుకోనున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల నేపథ్యంలో ఆయకట్టులో వరిసాగు ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది.

**వర్షపాతం వివరాలు (మి.మీ)**

| నెల | కురవాల్సిన వర్షం | గత సీజన్‌లో కురిసింది | ప్రస్తుతం కురిసింది |
|---|---|---|---|
| జూన్ | 83.2 | 93.1 | 86.3 |
| జూలై | 128.9 | 248.1 | 77.3 (ఇప్పటివరకు) |

**లోటు వర్షం కురిసిన మండలాలు..**

సాధారణ వర్షం కంటే -20 శాతం నుంచి - 59 శాతం వర్షం కురిస్తే లోటు వర్షంగా పరిగణిస్తారు. నల్లగొండ, గట్టుప్పల్, అనుముల హాలియా, నిడమనూరు, త్రిపురారం, వేములపల్లి, మిర్యాలగూడ, పెద్దవూర, తిరుమలగిరిసాగర్, అడవిదేవులపల్లి, పీఏపల్లి, నేరెడుగొమ్ము, కొండమల్లేపల్లి, గుండ్లపల్లి మండలాల్లో సాధారణం కంటే తక్కువ వర్షం కురిసింది.

**సాధారణ వర్షం కురిసిన మండలాలు..**

సాధారణ వర్షం కంటే 19 శాతం ఎక్కువ వర్షం కురిసిస్తే సాధారణ వర్షం కింద పరిగణిస్తారు. చిట్యాల, మునుగోడు, చండూరు, మాడుగులపల్లి, దామరచర్ల, గుర్రంపోడు, చందంపేట, దేవరకొండ మండలాల్లో సాధారణ వర్షం కురిసింది.

**అధిక వర్షం కురిసినవి..**

సాధారణం కంటే 20 శాతం ఎక్కువ వర్షం కురిస్తే అధిక వర్షం కింద పరిగణిస్తారు. వాటిలో నార్కట్‌పల్లి, కట్టంగూరు, శాలిగౌరారం, నకిరేకల్, కేతేపల్లి, తిప్పర్తి, కనగల్, మర్రిగూడ, చింతపల్లి, నాంపల్లి మండలాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షం కురిసింది.

**3.1 మిమీ సగటు వర్షపాతం నమోదు**

జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు ఉపరితల ఆవర్తన ద్రోణి కారణంగా 3.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. గుండ్లపల్లి మండలంలో 15.4, నకిరేకల్ 10.6, చందంపేట 10.5, శాలిగౌరారం 7.3, కేతేపల్లి 6.8, చిట్యాల 6.7, కట్టంగూరు 6.7, చండూరు 6.7, నార్కట్‌పల్లి 5.8, కనగల్ 5.1, దేవరకొండ 4.4, తిప్పర్తి 2.9, నేరెడుగొమ్ము 2.3, చింతపల్లి 1.9, మునుగోడు 0.9, మిర్యాలగూడ 0.9, నిడమనూరు 0.8, అనుముల హాలియా 0.7, మాడుగులపల్లి 0.7, నల్లగొండ 0.6, తిరుమలగిరిసాగర్ 0.5, వేములపల్లి 0.3, పెద్దవూర 0.3, గుర్రంపోడు 0.3, పీఏపల్లి 0.3, త్రిపురారం 0.2, దామరచర్ల మండలంలో 0.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

# అల్లర్ల కారకులను కఠినంగా శిక్షించాలి



నల్లగొండలోని క్లాక్‌టవర్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

రామగిరి(నల్లగొండ) : మణిపూర్ రాష్ట్రంలో అల్లర్లకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసీ గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి, లైంగికంగా వేధించిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ శనివారం టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో క్లాక్ టవర్ వద్ద నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలం నాటి అనాగరిక సంఘటనలు పునరావృతం కావడం దేశ ప్రతిష్టకు అవమానకమన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎడ్ల సైదులు, పెరుమాళ్ల వెంకటేశం మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో చెలరేగుతున్న అల్లర్లను తక్షణమే అదుపుచేసి శాంతిని పునరుద్దరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు బి.అరుణ, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భిక్షపతి, శ్యాంసుందర్, చంద్రమౌళి, నర్రా రాజశేఖర్‌రెడ్డి, అరుణ, గేర నరసింహ, రమాదేవి, సరళ, వరలక్ష్మి, శ్యాంకుమార్, సైదులు, జానకి, మురళయ్య, సాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

# నిబంధనలపై అవగాహన ఉండాలి



నకిరేకల్‌లో పోలింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న అదనపు జాయింట్ కలెక్టర్ ఖుష్బూ గుప్తా

నకిరేకల్ : ఎన్నికల నిబంధనలు, విధులపై అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. నకిరేకల్ తహసీల్దార్ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ స్థాయిలో ఎన్నికల నోడల్ అధికారులు, సూపర్‌వైజర్లకు ఎన్నికల నిబంధనలు, పోలింగ్ బూత్‌ల ఏర్పాట్లపై ఆమె పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈవీఎంల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఓటర్ జాబితాను పారదర్శకంగా రూపొందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, ఎన్నికల డీటీ పోట్టబత్తుల శ్రీనివాస్, తహసీల్దార్లు ప్రసాద్‌నాయక్, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సైదులు పాల్గొన్నారు.

# వసతిగృహాలను పరిశుభ్రంగా ఉంచాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న క్రిష్ణవేణి

మునుగోడు : వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచాలని బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి జీఆర్.క్రిష్ణవేణి వార్డెన్లకు సూచించారు. శనివారం ఆమె మునుగోడులోని బీసీ బాలుర, బాలికల హాస్టళ్లను ఆకస్మికంగా తనఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న మెనూ, ఇతర సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని సూచించారు. అందరూ ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు గంటల చొప్పున చదువుకునేలా టైమ్‌టేబుల్ రూపొందించాలని చెప్పారు. ఆమె వెంట ఎంపీపీ కర్నాటి స్వామి, ఎంపీడీఓ భాస్కర్‌గౌడ్, సూపరింటెండెంట్ విజయభాస్కర్, వార్డెన్లు ఉషరాణి, కరుణశ్రీ ఉన్నారు.

## క్షేత్రస్థాయిలో పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న ఆర్‌డీఓ రవి

నల్లగొండ : ప్రభుత్వ భూముల్లో నిర్మించుకున్న ఇళ్ల రెగ్యులరైజ్ కోసం 58,59 జీఓల కిందన వచ్చిన దరఖాస్తుల ఆధారంగా రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. అందులో భాగంగా నల్లగొండ ఆర్‌డీఓ రవి మామిళ్లగూడెం, మర్రిగూడ, పానగల్ తదితర ప్రాంతాల్లో తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు.

# మార్కెట్‌కు మరిన్ని నిధులు



నందికొండలో నిర్మాణంలో ఉన్న సమీకృత మార్కెట్

- నందికొండ సమీకృత మార్కెట్‌కు అదనంగా రూ.1.90 కోట్లు మంజూరు
- మారనున్న మార్కెట్ నమూనా

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ ప్రజల సౌకర్యార్థం చేపట్టిన సమీకృత మార్కెట్‌కు ప్రభుత్వం అదనపు నిధులు మంజూరు చేసింది. గతంలో రూ.2 కోట్లతో టెండర్ పిలిచి నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. ఆ నిధులు సరిపోకపోవడంతో నత్తనడకన నిర్మాణాలు సాగుతున్నాయి. దీంతో నిధులు పెంచడంతోపాటు మార్కెట్ నిర్మాణ నమూనాను మార్చాలని అధికారులు ఆలోచన చేశారు. వారి ఆలోచనకు అనుగుణంగా ప్రభుత్వం రూ.1.90 కోట్లు అదనపు నిధులు మంజూరు చేసింది.

**సకల హంగులతో సమీకృత మార్కెట్**

ఖాళీ స్థలాల్లో, రోడ్ల వెంట కూరగాయలు, చికెన్, మటన్, చేపల విక్రయాలకు ఇక కాలం చెల్లనుంది. నందికొండలో నాగార్జునసాగర్ డ్యాం సర్కిల్ కార్యాలయం ముందు సకల హంగులతో సమీకృత మార్కెట్ నిర్మిస్తున్నారు. నమూనాను మార్చి మరికొన్ని నిధులు మంజూరు చేయడంతో త్వరలోనే మార్కెట్ పనులు పూర్తికానున్నాయి.

**పార్కింగ్ స్థలం ఆక్రమణ**

కొంతమంది ఆక్రమణదారులు మార్కెట్ ముందున్న పార్కింగ్ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్లాట్లుగా మార్చేందుకు రాళ్లతో గుర్తులు పెట్టారు. ఇతర ప్రాంతాల వారికి అమ్మకానికి కూడా పెట్టినట్లు సమాచారం. దీనిపై సంబంధిత ఎన్నెస్పీ అధికారిని వివరణ కోరగా.. ఆక్రమణ విషయం తన దృష్టికి వచ్చిందని.. కాంట్రాక్టర్‌ను పిలిచి ప్రభుత్వ స్థలమని పేర్కొనేలా బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

## ర్యాగింగ్ నిరోధక చట్టంపై అవగాహన ఉండాలి

నార్కట్‌పల్లి : ప్రతి కాలేజీలో విద్యార్థులకు ర్యాగింగ్ నిరోధక చట్టంపై అవగాహన కల్పించాలని జిల్లా జడ్జి ఎం.నాగరాజు తెలిపారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం నార్కట్‌పల్లిలోని కామినేని మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ నిరోధక చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ చట్టం, కాస్మొటిక్స్ చట్టం గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి డివిఆర్.తేజోకార్తిక్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.దీప్తి, సీఐ ఆదిరెడ్డి, పిన్సిపాల్ మోహంతి ఉన్నారు.



కామినేని మెడికల్ కాలేజీలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి నాగరాజు

# 'లక్ష' సాయం ఆలస్యం

- కొలిక్కిరాని లబ్ధిదారుల ఎంపిక
- ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లకు బాధ్యత



నల్లగొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన బీసీలకు రూ.లక్ష ఆర్థిక సాయం అందడం మరింత ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది. ఆర్థిక సాయం కోసం వచ్చిన దరఖాస్తులన్నింటిని రాష్ట్ర స్థాయిలోనే సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ద్వారా పరిశీలించి మొదటి విడత లబ్ధిదారుల జాబితాను నిబంధనలకు అనుగుణంగా ఎంపిక చేశారు. అయితే ఆ జాబితాల్లో చాలా వరకు తేడాలు వస్తుండడం, రాజకీయ నాయకుల ఒత్తిడి రావడంతో దాన్ని మార్చి మండల స్థాయిలో ఎంపీడీఓలు, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్‌లు లబ్ధిదారుల జాబితాను తయారు చేయాలని ఆదేశాలు అందాయి. ప్రస్తుతం తయారైన జాబితాను మార్చుతుండడంతో ఆర్థిక సాయం అందడంలో మరింత జాప్యం జరిగే అవకాశం ఉంది.

**50 కులాలకు సాయం అందించాలని..**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బీసీల్లోని 15 వృత్తికులాలకు 35 ఎంబీసీ కులాలకు రూ.లక్ష ఆర్థిక సాయం ఇస్తామని ప్రకటించింది. అర్హుల నుంచి దరఖాస్తులు కోరగా నల్లగొండ జిల్లాలో 40,810 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వాటన్నింటిని పరిశీలించి 11,267 మంది దరఖాస్తుదారులు అర్హులుగా తేల్చారు. అర్హులకు విడతల వారీగా ఆర్థిక సాయం అందజేస్తామని పేర్కొంది. తొలివిడతలో ప్రతి నియోజకర్గంలో 300 మంది చొప్పున జూలై 15 నుంచి ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించింది. కానీ నేటికీ అమలుకు నోచుకోలేదు.

**కొనసాగుతున్న పరిశీలన**

ఆయా మండలాలు, పట్టణాల్లో రూ.లక్ష సాయం కోసం ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పరిశీలిస్తున్నారు. దరఖాస్తుదారుడు నిజంగా అర్హుడా, గతంలో ఏమైనా ఆర్థిక సాయం పొందాడా, అతని దరఖాస్తులో పొందుపర్చిన విషయాలు వాస్తవమేనా అనే కోణంలో పరిశీలిస్తున్నారు. వాటిలో నుంచి అర్హుల జాబితాను తయారు చేస్తున్నారు.

# కలెక్టరేట్ ఎదుట భగీరథ కార్మికుల నిరసన



కలెక్టరేట్‌లో నిరసన తెలుపుతున్న జేఏసీ నేతలు

నల్లగొండ : జీఓ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, కార్పొరేషన్‌లో ఉన్న అన్ని సౌకర్యాలు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ శనివారం మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికులు శనివారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి కలెక్టర్‌కు, మిషన్ భగీరథ ఎస్ఈకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ మిషన్ భగీరథ కార్యక్రమంలో ఇంటింటికి తాగునీరు అందించే పనిలో తాము అధికారులతో కలిసి పని చేస్తున్నమని తెలిపారు. ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలని, వారాంతపు సెలవులు, జాతీయ పండుగలకు కూడా సెలవులు ఇవ్వాలని వాల్వ్ ఆపరేటర్లకు టీఏ ఇవ్వాలని, ప్రతినెల 5వ తేదీలోపు వేతనాలు ఇవ్వడంతోపాటు 8 గంటల పని దినాలు అమలు చేయాలని కోరారు. రాఘవ, జీవీపీఆర్ కంపెనీలు రెండు సంవత్సరాల కాలంగా జీతాలు పెంచడంలేదని వెంటనే పెంచేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. విధి నిర్వాహణలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మిషన్‌భగీరథ కార్మిక సంఘం జేఏసీ చైర్మన్ జంజిరాల శ్రీనివాస్, తిరుగుడు కృష్ణ, నిమ్మనగోటి శ్రీను, మహ్మద్ జాని, సైదులు తదితరులు ఉన్నారు.

# కొత్త మండలాలకు ఏఈల నియామకం

**నూతన మండలాల ఏఈలు వీరే..**

| మండలం | ఏఈ |
|---|---|
| గట్టుప్పల్ | టి.ప్రవీణ్‌కుమార్ |
| మాడ్గులపల్లి | మణిదీప్ |
| అడవిదేవులపల్లి | ఎల్.శ్రీను |
| తిరుమలగిరి సాగర్ | సౌజన్య |
| నేరెడుగొమ్ము | వి.సాయిప్రకాష్ |

నల్లగొండ : జిల్లాలో ఏర్పడిన ఐదు కొత్త మండలాలకు విద్యుత్ శాఖ ఐదు సెక్షన్లను ఏర్పాటు చేసి వాటికి ఐదుగురు ఏఈలను నియమించింది. మండలాలు ఏర్పడిన నాటి నుంచి ఇన్‌చార్జి బాధ్యతల్లోనే అక్కడ ఏఈలు కొనసాగుతున్నారు. ప్రస్తుతం విద్యుత్ శాఖ ప్రజలకు సులువైన పద్ధతిలో సత్వరం సేవలు అందిచే విధంగా కొత్త సెక్షన్లు ఏర్పాటు చేసి ఏఈలను నియమించింది. ఇప్పటివరకు జిల్లాలో 33 సెక్షన్లు ఉండగా ప్రస్తుతం ఐదు సెక్షన్లు ఏర్పాటు చేయడంతో మొత్తం 38 సెక్షన్లకు పెరిగింది.

**ఒఅండ్‌ఎం స్టాఫ్ నియామకం ఎప్పుడో..**

ఐదు కొత్త మండలాలకు ఐదుగురు ఏఈలను నియమించిన విద్యుత్ శాఖ ఆయా మండలాల పరిధిలో ఆపరేటింగ్ అండ్ మెయింటెనెన్స్ (ఒఅండ్‌ఆర్) స్టాఫ్ అయిన లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్‌మెన్, జూనియర్ లైన్‌మెన్, ఆర్టిజెన్ పోస్టులు ఒక్కటి కూడా నియమించలేదు. దీంతో పాత వారితోనే పనులు చేయాల్సిన పరిస్థితి. దీంతో ఒ అండ్ ఎం పోస్టులను కూడా భర్తీ చేయాలంటూ విద్యుత్ ఉద్యోగుల సంఘం 1104 యూనియన్ జిల్లా కార్యదర్శి నిమ్మచెట్ల వెంకటయ్య ఉన్నతాధికారులను కోరారు.

## స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన ఇదార యే ఇఖామత్‌ఖానా బహదూర్ ఖాన్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ముస్లిం విద్యార్థులకు అందిస్తున్న స్కాలర్ షిప్‌ల కొరకు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంస్థ సెక్రటరీ డాక్టర్ ముంతాజ్ మోహినుద్దీన్ ఖురేషి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో పేద ముస్లిం విద్యార్థులు మెరిట్, ఈబీసీ స్కాలర్‌షిప్‌లు, ఉర్దూ మీడియం విద్యార్థులకు ప్రత్యేక మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందజే యనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆగస్టు 20వ తేదీలోపు సంస్థ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాలకు 97039 39088, 99853 49346 ఫోన్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### ఆపత్కాలంలో అండగా..

- గుండె సంబంధిత సమస్యకు గురైన చిన్నారి
- చికిత్స నిమిత్తం రూ.5లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించిన గొంగిడి సునీత



హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న చిన్నారి అనబత్తుల లహరి

**యాదగిరిగుట్ట రూరల్:** అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారికి ప్రభుత్వ విప్ గొంగిడి సునీత రూ.5 లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించి బాధిత కుటుంబాన్ని ఆదుకున్నారు. యాదగిరిగుట్ట మండలం గౌరాయపల్లి గ్రామంలో చేనేత కుటుంబానికి చెందిన అనబత్తుల లహరికి అకస్మాత్తుగా గుండె సంబంధిత సమస్య రావడంతో తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పారు. అన్ని రకాల పరీక్షలు నిర్వహించిన వైద్యులు గుండె పరిమాణం చిన్నదిగా ఉండడంతో, అత్యవసరంగా చికిత్స చేయాల్సి ఉంటుందని చెప్పారు. దీంతో పేద కుటుంబం కావడంతో వారు స్థానిక ఎమ్మెల్యే గొంగిడి సునీతను ఆశ్రయించారు. స్పందించిన ఆమె ఆస్పత్రి వైద్యుడు అమరేశ్వర్‌తో మాట్లాడారు. చికిత్స నిమిత్తం ప్రస్తుతం రూ.5 లక్షలు అవసరమని చెప్పడంతో, వెంటనే సీఎంఓ నుంచి ఈ ఆర్థిక సాయాన్ని మంజూరు చేయించారు. ఆపద సమయంలో ఆదుకున్న ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామని కుటుంబ సభ్యులు తెలిపారు.

### సరస్వతీ పుత్రుడికి ఆర్థికచేయూత



శివాజీకి ఆర్థికసాయం అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్ అసోసియేషన్ ప్రతినిధులు

**పెద్దవూర:** ఐఐటీలో ఉత్తమ ర్యాంక్ సాధించిన పెద్దవూర మండలంలోని పొట్టివాని తండాకు చెందిన రమావత్ శివాజీకి హెల్పింగ్ హ్యాండ్ అసోసియేషన్ ఆర్థిక చేయూతనందించింది. వీరిది నిరుపేద కుటుంబం కావడం, జార్ఖండ్‌లోని యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో సీటు సాధించిన శివాజీ అక్కడికి వెళ్లేందుకు కూడా డబ్బులు లేకపోవడంతో ఈనెల 17న 'సాక్షి' దినపత్రికలో 'సరస్వతీ పుత్రునికి ఆర్థిక చేయూతనివ్వరూ' శీర్షికన కథనం ప్రచురించింది. ఈ క్రమంలో శనివారం హెల్పింగ్ హ్యాండ్ అసోసియేషన్ సభ్యులు శివాజీ ఇంటికి వచ్చి అతని చదువు ఖర్చుల నిమిత్తం రూ. 20వేలు ఆర్థికసాయం అందజేశారు. ఇబ్బందుల్లో ఉన్న వారిని ఆదుకోవడంతో హెల్పింగ్ హ్యాండ్ అసోసియేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు నిమ్మల సాయిరెడ్డి, మిట్టపల్లి రవి, అన్వేషణ్ రెడ్డి, అజయ్, వంశి, సుమన్, సాయిచంద్ర తదితరులున్నారు.

# 'నకిలీ' భయం!

- నకిలీ వర్మీ కంపోస్టు ఎరువులను రైతులకు అంటగడుతున్న వ్యాపారులు
- ప్రముఖ కంపెనీ పేరుతో అడ్వాన్స్ తీసుకుని.. మరో కంపెనీ ఎరువులు సరఫరా
- నాంపల్లి, గట్టుప్పల్ మండలాల్లో ఆలస్యంగా వెలుగులోకి..

**మునుగోడు, చండూరు:** ప్రభుత్వం రైతులను నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తున్న వారి నుంచి కాపాడేందుకు అనేక ప్రయత్నాలు చేస్తోంది. అయినా నకిలీ వ్యాపారులు మాత్రం అధిక మొత్తంలో డబ్బులు సంపాదించుకోవాలనే ఉద్దేశంతో వివిధ రకాల ప్రయత్నాలు చేసి రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు అంటగడుతున్నారు. ఇలాంటి సంఘటనలు గట్టుప్పల మండలం, నాంపల్లి మండలాల్లో గత వారం రోజుల క్రితం చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

**30 మంది రైతుల నుంచి రూ.43వేలు అడ్వాన్స్ తీసుకుని..**

గట్టుప్పల మండలం వెల్మకన్నె గ్రామంలోని దాదాపు 30 మంది రైతుల నుంచి తాము ఎరువులు సరఫరా చేస్తామని ప్రముఖ ఎరువుల కంపెనీలో పనిచేస్తున్న ఇరువురు ఉద్యోగులు జూన్ 17న రూ.43వేలు అడ్వాన్స్ తీసుకున్నారు. రైతులు తమకు ఎరువుల బస్తాలు పంపాలని వారం రోజుల క్రితం కోరగా అడ్వాన్స్ తీసుకున్న ఇరువురు వేరే కంపెనీకి చెందిన నకిలీ ఎరువులను సరఫరా చేశారు. దీంతో ఒక కంపెనీకి సంబంధించిన ఎరువుల కోసం డబ్బులు ఇస్తే, వేరే కంపెనీ ఎరువులు ఎందుకు పంపించారని రైతులు ప్రశ్నించారు. ఈ విషయంపై మండల వ్యవసాయ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఏఓ శ్రీనివాస్ గత శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లి ఎరువుల బస్తాలను పరిశీలించారు. బస్తాలు సరఫరా చేసినా ఇరువురు ఉద్యోగులు గ్రామానికి వ్యవసాయ అధికారులు వచ్చారన్న విషయం తెలుసుకుని అక్కడనుంచి నుంచి పరారైనట్లు తెలిసింది.



వెల్మకన్నె రైతులకు ఇచ్చిన నకిలీ ఎరువుల బస్తాలు

**ఇటీవల నాంపల్లిలో కేసు..**

ఇదే తరహాలో ప్రముఖ కంపెనీ పేరుతో నకిలీ వర్మి కంపోస్టు ఎరువులు తయారుచేసి రైతులను మోసం చేసిన ఘటన ఇటీవల నాంపల్లి మండలంలోని గానుగుపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. దీనిపై ఈ నెల 4న వ్యవసాయ అధికారులు కేసు నమోదు చేశారు. అదే గ్రామంలోని వ్యవసాయ బావి వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా ఓ కంపెనీ పేరుతో ఎరువులను సిద్ధం చేసి రైతులకు విక్రయిస్తున్నారు. అయితే వీరు ప్రముఖ కంపెనీలో ఉద్యోగులుగా పనిచేసి ఇటీవల బయటకు వచ్చి ఇలా నకిలీ ఎరువులను తయారు చేసి మోసం చేస్తున్నారని తెలిసింది. ఈ విషయంపై రైతులు వ్యవసాయ అధికారులకు సమాచారం అందించగా ఎరువుల తయారీ కేంద్రంపై దాడిచేసి అక్కడ లభించిన 47 బస్తాల ఎరువులతో పాటు 66 బస్తాల రా మెటీరియల్, తయారీకి ఉపయోగించే యంత్రాలను సీజ్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**7 బస్తాల నకిలీ ఎరువులు ఇచ్చారు**



మా గ్రామానికి చెందిన ఓ యువకుడు ప్రముఖ ఎరువుల కంపెనీలో పనిచేస్తున్నానని చెబితే నాకు 7 బస్తాలు కావాలని రూ.700 అడ్వాన్స్ ఇచ్చాను. నాతో పాటు మరో 20 మంది రైతులు కూడా ఇచ్చారు. అతను మేము డబ్బులు కట్టిన ఎరువుల కంపెనీ బస్తాలు కాకుండా వేరే కంపెనీకి చెందిన నకిలీ ఎరువుల బస్తాలు పంపించాడు.

– వెంకన్న, రైతు, వెల్మకన్నె

**ఎరువులు విక్రయించిన వారిపై ఆరా తీస్తున్నాం**



రైతులకు నకిలీ వర్మి కంపోస్టు ఎరువులు విక్రయించినవారిపై ఆరా తీస్తున్నాం. వెల్మకన్నె గ్రామంలో దాదాపు 30 మంది రైతుల వద్ద రూ.41 వేలు అడ్వాన్స్ తీసుకొని నాణ్యమైన కంపెనీ ఎరువులు ఇస్తామని వేరే కంపెనీకి చెందిన 112 బస్తాల ఎరువులను సరఫరా చేశారు. ఆ కంపెనీకి ఎలాంటి అనుమతులు లేవు. త్వరలో వారిని గుర్తించి కేసు నమోదు చేయిస్తాం.

– శ్రీనివాస్‌గౌడ్, మండల వ్యవసాయ అధికారి, మునుగోడు

## అనాథను అక్కున చేర్చుకున్న అన్నపూర్ణ సేవా సంస్థ

**నేరేడుచర్ల:** మతిస్థిమితం కోల్పోయిన ఓ మహిళ సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలో వారం రోజులుగా రోడ్డు వెంట ఉండి యాచక వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. స్థానికులు ఆరా తీయగా ఆమెది మధ్యప్రదేశ్ అని, తన కుటుంబ సభ్యులు కొట్టడంతో పారిపోయి ఇక్కడకు వచ్చినట్లు తెలిసింది. జడ్చర్ల- కోదాడ ప్రధాన రహదారిపై వీధి లైట్ల కింద నాలుగు రోజులుగా వర్షానికి తడుస్తూ ఉంటుండంతో స్థానికులు ఆమె దీనస్థితిని వీడియో తీసి 'ఈ అనాథకు దిక్కెవరు' అని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. స్పందించిన ఆర్‌ఎస్‌ఎస్ సేవా భారతి సభ్యుడు రాము ఆమెకు శనివారం అల్పాహారం అందించి నల్లగొండలోని సేవా భారతి స్వచ్ఛంద సంస్థ సభ్యులు భీమనపల్లి శ్రీకాంత్‌కు సమాచారం అందించాడు. ఆయన అంబులెన్స్‌లో నేరేడుచర్లకు వచ్చి సేవా భారతి సభ్యులు, స్థానిక పోలీసులు, మున్సిపల్ శాఖ సిబ్బంది సహకారంతో మతిస్థిమితం కోల్పోయిన మహిళను సూర్యాపేట సమీపంలో గల దురాజ్‌పల్లిలోని అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ అనాథ ఆశ్రమంలో ఆశ్రయం కల్పించారు. కార్యక్రమంలో సేవా భారతి సభ్యులు మెట్టు వేణుగోపాల్‌రెడ్డి, చామకూరి వీరయ్య, సంపత్, రాములు, రాము, నాగిరెడ్డి, సైదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, స్థానికులు వెంకన్న, శంకర్‌రెడ్డి, కోటేశ్వర్‌రావు, వెంకటకృష్ణ తదితరులున్నారు.



మతిస్థిమితం కోల్పోయిన మహిళను ఆశ్రమంలో చేర్చుకుంటున్న ట్రస్ట్ సభ్యులు

## నాలుగు రోజుల్లో కుమారుడి జన్మదినం..

- షాపింగ్ చేస్తుండగా గుండెపోటుకు గురైన తల్లి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

**చౌటుప్పల్:** తమ కుమారుడి మొదటి జన్మదిన వేడుకలకు సంబంధించిన సామగ్రి కొనుగోలు కోసం తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ఓ షాపింగ్ మాల్‌కు వెళ్లారు. అక్కడే సామగ్రి ఖరీదు చేస్తుండగా తల్లి అకస్మాత్తుగా గుండెపోటుకు గురైంది. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. వివరాలిలా ఉన్నాయి. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని మార్కండేయనగర్ కాలనీకి చెందిన గోశిక ప్రవీణ్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. నల్లగొండకు చెందిన స్వాతి(30)తో వివాహం జరిగింది. వీరికి కుమార్తె స్వీటి(05), కుమారుడు విబ్బు ఉన్నారు. వీరు ప్రస్తుతం ఉద్యోగరీత్యా మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఈనెల 25న కుమారుడి మొదటి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించేందుకుగాను ఇటీవల స్వగ్రామానికి వచ్చారు. ప్రస్తుతం ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈమేరకు శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లో షాపింగ్ చేస్తుండగా స్వాతి అకస్మాత్తుగా కిందపడిపోయింది. అక్కడే ఉన్న భర్త ప్రవీణ్, కుటుంబ సభ్యులు కామినేని ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందింది. దీంతో చిన్నారులు తల్లిలేని వారయ్యారు. కుమారుడి జన్మదిన వేడుకల కోసం ఏర్పాట్లు చేస్తూ గుండెపోటుకు గురై తల్లి మృతిచెందడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నిలిపింది. ఇదిలా ఉండగా శనివారం దైవ దర్శనం నిమిత్తం శ్రీశైలం దేవస్థానానికి వెళ్లే ఏర్పాట్లు కూడా చేసుకున్నారు. ఇంతలోనే ఇలా జరిగింది.



స్వాతి (ఫైల్)

## రేషన్ పంపిణీలో కల్తీ బియ్యం

**మునుగోడు:** మునుగోడు మండలంలోని కిష్టాపురం గ్రామంలో ఇటీవల పంపిణీ చేసిన రేషన్‌లో కల్తీ బియ్యం వచ్చాయని మహిళలు తెలిపారు. ఎప్పటిలాగే రేషన్ దుకాణంలో బియ్యం తెచ్చుకున్న కార్డుదారుల్లో పలువురు మహిళలు శనివారం అన్నం వండేందుకు బియ్యాన్ని నానపెట్టగా అవి పైకి తేలాయి. దీంతో అనుమానం వచ్చి ఆ బియ్యాన్ని కొరికి చూశారు. అవి విరగకపోవడంతో ప్లాస్టిక్ బియ్యంగా గుర్తించారు. రేషన్ దుకాణాలకు పంపిణీ చేస్తున్న బియ్యంలో కల్తీ బియ్యం ఎలా వచ్చాయో అధికారులు విచారణ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై నల్లగొండ డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇప్పటి వరకు రేషన్ దుకాణాల్లో ప్లాస్టిక్ బియ్యం వచ్చినట్లు తమ దృష్టికి రాలేదని చెప్పారు. బియ్యాన్ని పరిశీలించి అవి ఏ బియ్యమనేది నిర్ధారిస్తామని తెలిపారు. ఇటీవల ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యంలో పోషకాలు పెరిగేందుకు ఎఫ్‌ఆర్‌కె అనే పదార్థాలను కలిపి పంపిస్తుందని, అవి ఆ బియ్యంలో కరిగి పోషకాలు అందిస్తాయని చెప్పారు. ఈ బియ్యం నీటిలో పోస్తే తేలే అవకాశం లేదని పేర్కొన్నారు.



కల్తీ బియ్యం వచ్చాయని చూపుతున్న కిష్టాపురం గ్రామ మహిళలు



## అనారోగ్యంతో పంచాయతీ కార్మికురాలు మృతి

**త్రిపురారం:** మండలంలోని పెద్దదేవులపల్లిలో గ్రామ పంచాయతీ కార్మికురాలిగా పని చేస్తున్న ఇరిగి రాములమ్మ(53) అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. 17 రోజులుగా త్రిపురారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు ఆమె హాజరవుతోంది. ఈక్రమంలో రాములమ్మ మృతి చెందడంతో తోటి కార్మికులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. మండలంలోని ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న కార్మికులు పెద్దదేవులపల్లిలో ఇరిగి రాములమ్మ ఇంటికి వెళ్లి ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు పోలె సాంబయ్య మాట్లాడుతూ.. పని లేదనే మనోవేదనతో అనారోగ్యానికి గురై కార్మికురాలు రాములమ్మ మృతి చెందిందని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చాలని కోరారు.

## 7 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

**భూదాన్‌పోచంపల్లి:** అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. ఈ సంఘటన శనివారం భూదాన్‌పోచంపల్లి మండలంలోని పెద్దరావులపల్లి శివారులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం పచ్చర్లబోడు తండాకు చెందిన కృష్ణ అనేవ్యక్తి తన వాహనంలో 7 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పెద్దరావులపల్లి గ్రామ శివారులో ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు. కృష్ణపై కేసు నమోదు చేసి, వాహనంతో పాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



పోలీసుల అదుపులో నిందితుడు, బియ్యం వాహనం

## సూర్యాపేటలో సుపారీ గ్యాంగ్ అరెస్ట్

- ప్రేమ వ్యవహారానికి అడ్డొస్తున్నాడని ఓ వ్యక్తిని చంపేందుకు కుట్ర
- పోలీసులకు పట్టుబడ్డ ముఠాలోని ముగ్గురు సభ్యులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

**సూర్యాపేట క్రైం:** హత్యాయత్నాన్ని ముందుగా పసిగట్టిన సూర్యాపేట పోలీసులు భగ్నం చేశారు. ముఠాలోని ముగ్గురు సభ్యులను అరెస్టు చేసి, వారి నుంచి డమ్మీ పిస్టల్, డమ్మీ బుల్లెట్లు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఎస్పీ రాజేంద్రప్రసాద్ వివరాలు వెల్లడించారు. జిల్లా కేంద్రంలో డీఎస్పీ ఆదేశానుసారం పట్టణ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ యాకూబ్ క్రైమ్ సిబ్బందితో కలిసి ఖమ్మం క్రాస్ రోడ్డు వద్ద పట్టణంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు వారిని పట్టుకొని తనిఖీ చేయగా వారి వద్ద ఉన్న సంచిలో రెండు కత్తులు, డమ్మీ పిస్టల్, డమ్మీ బుల్లెట్లు ఉన్నాయి. విచారించగా చివ్వెంల మండలం కోటియాతండాకు బాణోతు రాజేష్, చిలుకూరు మండలం బేతవోలుకు వంగూరి కోటయ్య, గరిడేపల్లి మండలం పొనుగోడుకు చెందిన నందిపాటి మధులు ముగ్గురూ మార్చిలో హుజూర్‌నగర్ జైల్లో పరిచయమయ్యారని తేలింది. గతంలో వారిపై మేళ్లచెరువు, చిలుకూరు, గరిడేపల్లిలో కేసులు ఉన్నాయి. కాగా.. బాణోతు రాజేష్ ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. అయితే సూర్యాపేట ముత్తూట్ ఫైనాన్స్‌లో పనిచేసే యాశమళ్ల శరీన్ వీరి ప్రేమకు అడ్డుపడుతున్నాడు. దీంతో అతడి అడ్డు తొలగించాలని రాజేశ్ కోటయ్య, మధులను కోరగా.. వారు దానికి అంగీకరించారు. దీనికి గాను రూ.2లక్షల 50వేలకు సుపారీకి ఒప్పుకొని రూ.50వేలు అడ్వాన్స్‌గా తీసుకున్నారన్నారు. రాజేష్, కోటయ్య, మధులు శరీన్ పనిచేసే హోండా షోరూమ్ వద్ద రెక్కీ నిర్వహించి వెళ్లారు. శనివారం సాయంత్రం యాశమళ్ల శరీన్ ఫైనాన్స్ కంపెనీ నుంచి బయటకు వచ్చినప్పుడు చంపాలని నిర్ణయించుకొని సూర్యాపేటకు వచ్చారు. అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు వారిని పట్టుకున్నారు. వారి నుంచి కత్తులు, డమ్మీ పిస్టల్, బుల్లెట్లు స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన పట్టణ సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ ఎస్‌కె యాకూబ్, హెడ్ కానిస్టేబుల్ గోదేశి కర్ణాకర్, గొర్ల కృష్ణ, వీరయ్య, కానిస్టేబుల్ సైదులు, ఆనంద్, బజార్, మధులను ఎస్పీ, డీఎస్పీలు అభినందించి రివార్డులు ప్రకటించారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం

**చిట్యాల:** చిట్యాల పట్టణంలో జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మునుగోడు మండలం చీకటిమామిడి గ్రామానికి చెందిన అనంత బాలరాజు (52) చిట్యాల పట్టణంలో జెడ్పీహెచ్‌ఎస్ హైస్కూల్ ఎదురుగా గల పుట్‌ఓవర్ బ్రిడ్జి కింది నుంచి నడుచుకుంటూ జాతీయ రహదారిని దాటే ప్రయత్నం చేస్తున్నాడు. ఈ క్రమంలో మిర్యాలగూడ నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా.. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురిలో ముందు సీట్లో కూర్చున్న సత్యనారాయణకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇతడిని వైద్యచికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. మృతుడు బాలరాజు సంస్థాన్‌నారాయణపురంలోని సంక్షేమ హాస్టల్‌లో పార్ట్ టైమ్ కుక్‌గా పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని ప్రమాద వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా.. రోడ్డు ప్రమాదంతో అక్కడ కొద్దిసేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. నెమ్మదిగా వెళ్తున్న కారును వెనుక నుంచి వచ్చిన ట్రాలీ ఆటో ఢీకొట్టింది. దీంతో ఇరువురు వాహనదారులు వాగ్వాదానికి దిగారు. పోలీసులు వారికి సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించి వేశారు.



మృతుడు బాలరాజు

## భువనగిరి రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన డీఆర్‌ఎం

**భువనగిరి:** సౌత్ సెంట్రల్ రైల్వే డీఆర్‌ఎం భరతేష్ కుమార్ జైన్ సికింద్రాబాద్ నుంచి కాజీపేట వరకు ప్రధాన రైల్వే స్టేషన్ల పరిశీలనలో భాగంగా శనివారం భువనగిరి రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యాలు, వాటి ఏర్పాట్లు, స్టేషన్ మాస్టర్ గదిలోని రికార్డులు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో సమీపంలో ఉన్న రైల్వే క్వార్టర్స్‌ను పరిశీలించి వాటిలో సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.



రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం భరతేష్ కుమార్ జైన్



## చికిత్స పొందుతున్న యువకుడు మృతి

**మునగాల(కోదాడ):** అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. మునగాల మండల కేంద్రానికి చెందిన మధు, రమణల పెద్ద కుమారుడు ఉదయ్‌కిరణ్(22) కోదాడలోని అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఈనెల 11న వాంతులు, విరోచనాలతో బాధపడుతుండగా కుటుంబసభ్యులు స్థానిక ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లగా.. తగ్గకపోవడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఉదయ్‌కిరణ్‌కు వైద్యచికిత్స చేయించలేని స్థితిలో ఉండగా 'సాక్షి' దినపత్రిక ఈనెల 18న 'పేద కుటుంబానికి అనుకోని కష్టం' శీర్షికన ఉదయ్‌కిరణ్ కన్నీటి గాథను ప్రచురించింది. దీంతో పలువురు దాతలు స్పందించి వైద్యచికిత్స కోసం తమకు తోచిన విధంగా ఆర్థికసాయం అందించారు. అయినప్పటికీ ఉదయ్‌కిరణ్ ఆరోగ్య పరిస్థితి పూర్తిగా విషమించి శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. చేతికి ఎదిగిన కొడుకు కళ్లముందే మృత్యువాత పడడంతో తల్లి గుండె పగిలేలా రోదిస్తోంది. ఉదయ్‌కిరణ్ మృతితో మండల కేంద్రంలోని హరిజన కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.



ఉదయ్‌కిరణ్ (ఫైల్)

**నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తుతెలియని వృద్ధుడు..**

**నల్లగొండ క్రైం:** నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని 55 ఏళ్ల వృద్ధుడు శనివారం మృతి చెందాడని పోలీస్ అవుట్ పోస్ట్ ఏఎస్సై సైదులు తెలిపారు. ఈనెల 1న అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరాడని పేర్కొన్నారు. వివరాలు రికార్డుల్లో లేవని, ఎవరికైనా తెలిస్తే 94410 93561నంబర్‌ను సంప్రదించాలని కోరారు.



## భూతగాదాలతో ఘర్షణ

- మహిళకు గాయాలు

**పెద్దఅడిశర్లపల్లి:** భూతగాదాలతో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో మహిళకు గాయాలయ్యాయి. ఈ సంఘటన పెద్దఅడిశర్లపల్లి మండలంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వద్దిపట్ల గ్రామానికి చెందిన ఏనిక శారద, పాలకూర్ల ఆంజనేయులు కుటుంబ సభ్యుల మధ్య గత కొంతకాలంగా భూతగాదాలు జరుగుతున్నాయి. ఈ విషయంలో గుడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేసుకున్నారు. శనివారం ఉదయం తగాదా ఉన్న పొలం వద్ద ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో శారదకు గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కులం పేరుతో దూషించి తన భార్యను తీవ్రంగా గాయపర్చారని శారద భర్త వెంకటేశ్వర్లు గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై గుడిపల్లి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డిని సంప్రదించగా ఫిర్యాదు అందినట్లు పేర్కొన్నారు.

# రైతుబీమాకు మరోసారి అవకాశం

- 10వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ
- ఆగస్టు 5 వరకు గడువు
- నమోదు చేసుకోని రైతుల పేర్లు నోటీస్ బోర్డుపై పెడుతున్న అధికారులు

**భువనగిరిటౌన్:** రైతుబీమా పథకానికి మరోసారి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో దరఖాస్తు చేసుకోనివారు, కొత్తగా భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు ప్రస్తుతం నమోదు చేసుకోవచ్చు. ఈనెల 10 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుండగా ఆగస్టు 5వ తేదీ వరకు గడువు విధించారు. ఎలాంటి ప్రీమియం లేకుండా భూమి పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు వివరాలను సంబంధిత ఏఈఓకు సమర్పించాల్సి ఉంటుంది. గతంలో బీమా కోసం దరఖాస్తు చేసుకోని వారి పేర్లను ఏఈఓలు గ్రామ పంచాయతీ, రైతు వేదికల్లో నోటీస్ బోర్డుపై పెడుతున్నారు. ఇందులో ఉన్న రైతులు బీమా చేయించుకోవాలని వ్యవసాయ అధికారులు ప్రచారం చేస్తున్నారు. కాగా.. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ బీమా పథకం రైతు కుటుంబాలకు ఎంతో ధీమా ఇస్తోంది. ఈ పథకం కింద ఎవరైనా రైతు మృతిచెందితే పది రోజుల్లోగా నేరుగా బాధిత కుటుంబంలో నామినీగా ఉన్న వారి బ్యాంకు ఖాతాలో రూ.5 లక్షలు జమ చేస్తున్నారు. ఈ క్రమంలో జిల్లాలో ఇప్పటివరకు 3వేలకు పైగా బాధిత కుటుంబాలు రైతుబీమా అందుకున్నాయి. కాగా.. యాదాద్రి భువనగిరి జిల్లాలో మొత్తం 1,30,819 మంది నమోదు చేసుకోవాల్సి ఉండగా 1,15,905 మంది మాత్రమే బీమా చేయించుకున్నారు. 14,914 మంది నమోదు చేసుకోవాల్సి ఉంది.



బొమ్మలరామారం మండలం చీకటిమామిడి రైతు వేదికలో బీమా పత్రాలు స్వీకరిస్తున్న ఏఈఓ

**అంతా పారదర్శకంగా..**

రాష్ట్ర ప్రభుత్వం 2018 ఆగస్టు 15న రైతు బీమా పథకాన్ని తీసుకువచ్చింది. 18సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వయసు ఉన్న రైతుల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, అర్హులైన రైతులకు బీమా బాండ్లు అందజేస్తారు. రైతులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా ప్రభుత్వమే ఎల్‌ఐసీకి రైతుల పేరున బీమాకు సంబంధించిన ప్రీమియం సొమ్ము జమ చేస్తుంది. ఈ పథకంలో పేరు నమోదైన రైతు ఏ కారణంతోనైనా మృతిచెందినా నామినిగా ఉన్న వారికి రూ.5 లక్షల బీమా సొమ్మును బ్యాంకు ఖాతాలో నేరుగా జమచేస్తూ పూర్తి పారదర్శకత పాటిస్తున్నారు.

**దరఖాస్తు చేసుకోవాలి**

రైతు బీమా పథకానికి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. అర్హులైన రైతులు పట్టా పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం అందించి ఆయా గ్రామాల ఏఈఓల దగ్గర వివరాలు నమోదు చేయించుకోవాలి. రైతులు ఏదేని కారణంతో మరణిస్తే, విషయం ఫోన్లో సమాచారం ఇచ్చినా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. పది రోజుల్లోగా నామినీగా ఉన్న వ్యక్తి బ్యాంకు ఖాతాలో రూ.5 లక్షల బీమా సొమ్ము జమ అవుతాయి.

– అనురాధ, జిల్లా వ్యవసాయ అధికారిణి, యాదాద్రి భువనగిరి

**ఒక్కో రైతుకు రూ.3,555 ప్రీమియం**

పథకం ప్రారంభంలో ప్రభుత్వం ఒక్కో రైతుకు రూ.2,271.50 ప్రీమియంను ఎల్‌ఐసీకి చెల్లించింది. 2019 నుంచి ప్రీమియం పెరగడంతో ప్రస్తుతం ఒక్కో రైతుకు రూ.3555.94 చెల్లిస్తోంది. రైతు బీమా ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 2,829 మంది రైతులు వివిధ కారణాలతో మృతి చెందారు. వారి కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున రూ.141.45కోట్లు అందజేసినట్లు వ్యవసాయశాఖ అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

**జిల్లాలో వచ్చిన దరఖాస్తులు.. మంజూరైన నిధులు**

| సంవత్సరం | దరఖాస్తులు | మంజూరు చేసినవి | రూ. కోట్లు |
|---|---|---|---|
| 2018 | 569 | 563 | 28.15 |
| 2019 | 563 | 562 | 28.10 |
| 2020 | 785 | 782 | 39.10 |
| 2021 | 598 | 595 | 29.75 |
| 2022 | 447 | 327 | 16.35 |
| మొత్తం | 2,961 | 2,829 | 141.45 |